సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 21 । నవంబర్ । 2023



ఇద్దరు దొంగల ముఠా సభ్యుల అరెస్టు

తాళాలు వేసిన ఇళ్లపై రెక్కీ నిర్వహించి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగల ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. - 8లో



రిమ్స్‌లో డీఎంఈ పర్యటన

రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్(డీఎంఈ) డాక్టర్ డీవీఎస్ఎల్ నరసింహం కడప ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాలలో సోమవారం పర్యటించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.300
రెండోరకం	రూ.110	రూ.220



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 341 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	383	490
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 328.240 కిలోలు

న్యూస్‌రీల్

పల్లకిలో ఊరేగిన శ్రీ భద్రకాళీ సమేతుడు



పల్లకీలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటిటౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి మూల విరాట్ స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలాగే ఉత్సవ విగ్రహాలకు అబిషేకాలు, పూజలు నిర్వహించి అందంగా అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢ వీధులలో ఊరేగించారు. ఈ పల్లకీ సేవ ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు. ఈ పల్లకి సేవలో స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు. వీరికి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు

రాయచోటిటౌన్ : ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్ టిక్కెట్లు ఆన్‌లైన్ ద్వారా డౌన్ లోడ్ చేసుకొని విద్యార్థులకు అందజేయాలని ప్రభుత్వ పరీక్షల సంచాలకులు దేవానందరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 సంవత్సరానికి జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్)లు డిసెంబర్ 3వ తేది ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ పరీక్షలకు సంబంధించి హాల్ టిక్కెట్లు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయపు వెబ్‌సైట్ www.bre.ap.gov.in ద్వారా డౌన్ లోడ్ చేసుకొని విద్యార్థులకు అందజేయాలని చెప్పారు. సంబంధితన పాఠశాల కోడ్ ఉపయోగించి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చుని వివరించారు.

సకాలంలో సమస్యలను పరిష్కరించాలి

– ఎస్పీ బి.కృష్ణారావు



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ బి. కృష్ణారావు

రాయచోటి : స్పందన కార్యక్రమం ద్వారా అందజేస్తున్న ప్రజల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని ఎస్పీ బి.కృష్ణారావు కింది స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ నేరుగా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 82 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ తెలిపారు. స్పందనలో వచ్చే ఫిర్యాదులపై ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత సమయంలోగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వీడియో కాన్ఫరెన్స్ మరియు టెలీకాన్ఫరెన్స్‌లో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

హార్సిలీహిల్స్ సందర్శన



హార్సిలీహిల్స్‌పై పార్లమెంటు సెక్షన్ ఆఫీసర్ల బృందం

బి.కొత్తకోట : పార్లమెంటులో సెక్షన్ ఆఫీసర్లుగా నియమితులైన బృంద సభ్యులు సోమవారం బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌ను సందర్శించింది. 40 మంది ఉన్న ఈ బృందం పార్లమెంటులో సెక్షన్ ఆఫీసర్లుగా నియమితులయ్యారు. ఇందులో భాగంగా భారత సంచార యాత్ర చేపట్టిన ఈ బృందం ముఖ్యమైన ప్రాంతాలు, పర్యాటక, సందర్శన ప్రాంతాల్లో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా హార్సిలీహిల్స్ వచ్చిన ఈ బృందం కొండపై ప్రకృతి అందాలను తిలకించింది. కొండకు సంబంధించిన చరిత్ర, వింతలు, విశేషాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

25న శ్రీశైలానికి స్పెషల్ బస్సు

మదనపల్లె సిటీ : కార్తీకమాసం పురస్కరించుకుని శ్రీశైలానికి ప్రత్యేక స్పెషల్ బస్సు నడపనున్నట్లు ఆర్టీసీ-2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. 25న సాయంత్రం మదనపల్లె నుంచి బయలుదేరి 26న ఉదయం పౌర్ణమి రోజున శ్రీశైలంకు చేరుతుందన్నారు. అక్కడ దర్శనం చేసుకున్న తర్వాత పుష్పగిరి, వీరభద్రస్వామిగుడి చూసుకుని అదే రోజు రాత్రి 10 గంటలకి మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. టిక్కెట్టు రూ.1500 చెల్లించాలన్నారు. వివరాలకు 9959225677, 9160186645ను సంప్రదించాలని సూచించారు.

జనజాతర



బస్సు యాత్రలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యే, మేయర్ తదితరులు



వైఎస్ఆర్ జిల్లా మైదుకూరులో జరిగిన సామాజిక సాధికార యాత్రకు హాజరైన జనం

- మైదుకూరులో సామాజిక సాధికార యాత్రకు పోటెత్తిన బహుజనులు
- కెఎస్‌సీ కల్యాణమండపం నుంచి భారీగా బస్సు యాత్ర ర్యాలీ
- హారతి పళ్లాలతో స్వాగతం పలికిన మహిళలు

సాక్షి ప్రతినిధి, కడప : కార్తీక సోమవారం కావడం వల్ల భక్తులతో శివాలయాలు పోటెత్తగా, మరోవైపు మైదుకూరు జనజాతరతో హోరెత్తింది. బహుజనులంతా ఏకతాటిపై నాలుగురోడ్లు కూడలికి చేరారు. సామాజికంగా, రాజకీయంగా అండగా నిలుస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతుగా ఆత్మగౌరం నిలుపుకునేందుకు నియోజకవర్గ నలుమూలల నుంచి భారీ స్థాయిలో జనం చేరుకున్నారు. కేఎస్‌సీ కల్యాణమండపంలో తటస్థులతో సమావేశం అనంతరం అక్కడి నుంచి బస్సు యాత్ర ర్యాలీ ప్రారంభమైంది. 2 కిలోమీటర్లు ఉన్న ఈ ర్యాలీలో బస్సుపైన ఎమ్మెల్యే ఎస్ రఘురామిరెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, డిప్యూటీ సీఎంలు నారాయణస్వామి, ఎస్‌బి అంజాద్‌బాషా తరలిరాగా, మైదుకూరు మహిళలు హారతి పళ్లాలు చేతబూని మంగళహారతులు ఇస్తూ స్వాగతం పలికారు. మరోవైపు దేవుడు పుట్టిన గడియల్లో పుట్టిన జగనన్నా...అంటూ రాగాయుక్తంగా ఉంటున్న వైఎస్సార్‌సీపీ పాటలకు మహిళలు కోలాటం కనువిందు చేసింది.

తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా ఛీత్కారాలు చవిచూసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన ప్రజానీకానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆత్మగౌవరం దక్కింది. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా అనుకుంటారా..బీసీలని చలాయిస్తే కుదరదు, తోక కట్ చేస్తా.. అని హెచ్చరికలు చేసిన నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఓవైపు. నా ఎస్సీలు, నా బీసీలు, నా ఎస్టీలు, నా మైనార్టీలని బడుగు, బలహీనవర్గాలను సొంతం చేసుకుంటున్న నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోవైపు నిలుస్తుండడంతో బహుజనులంతా ఆత్మగౌరవం దిశగా అడుగులు వేశారు. మైదుకూరులో వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రకు కదిలివచ్చి కదం తొక్కారు. మైనార్టీలకు ప్రాధాన్యత లేని 2014-19 నాటి టీడీపీ సర్కార్‌కు మరోమారు మైనార్టీ దెబ్బ రుచిచూపిస్తామంటూ ఆత్మాభిమానం చాటుకుంటూ హెచ్చరికలు చేశారు.

ఆకట్టుకున్న నేతల ప్రసంగాలు....

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎప్పుడూ ఈ స్థాయిలో సామాజిక న్యాయం పాటించిన ముఖ్యమంత్రి భారతదేశ చరిత్రలో మరెవ్వరూ లేరని గణాంకాలతో వివరిస్తూ నేతల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. దేశ చరిత్రలో మైనార్టీ ప్రాతినిధ్యం లేకుండా ఉన్న ఏకైక మంత్రివర్గ కూర్పు సైతం టీడీపీకే దక్కిందని మంత్రులు వివరిస్తుంటే, వాస్తవమే కదానంటూ సభికులు చర్చించుకోసాగారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ. మైనార్టీలకు డిప్యూటీ సిఎం హోదా కట్టబెట్టిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి దక్కిందని నేతలు కొనియాడారు. సామాన్యులను ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా చేసి, రాజ్యాధికారం కల్పించారని నేతల స్వగతం వివరిస్తుంటే జనం ఆసక్తిగా ఆలకించారు.

సామాజిక స్పృహ మరచి ప్రవర్తించిన ఎల్లోమీడియా....

సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడితే ఎల్లోమీడియా మాత్రం సామాజిక స్పృహ మరచి మరీ ప్రవర్తించింది. బస్సు యాత్రలో పాల్గొనేందుకు మధ్యాహ్నం నుంచి వేలాది మంది సభాస్థలి వద్ద నేతల కోసం వేచిచూశారు. ప్రత్యేకించి మహిళలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున తరలివచ్చారు. వీరంతా మధ్యాహ్నం 2 గంటల నుంచి నేతల ప్రసంగాల కోసం ఎదురుచూశారు. వీరిలో చాలా మంది మైదుకూరు పట్టణం నుంచే కాకుండా సమీప గ్రామాల నుంచి తరలివచ్చారు. సభాస్థలి జనంతో కిక్కిరిసి పోయింది. సాయంత్రం కావడంతో మధ్య మధ్యలో కొంత మంది ఇతర గ్రామాలకు వెళ్లాల్సిన వారు వెళ్లడం ఆరంభించారు. అదును కోసం అక్కడే వేచి ఉన్న ఎల్లోమీడియా వెంటనే కనీస స్పృహ మర్చిపోయింది. వెంటనే ఖాళీ కుర్చీల వీడియోలు, ఫొటోల కోసమే కార్యక్రమానికి వచ్చినట్లుగా ప్రవర్తించింది. మంత్రులు మాట్లాడుతున్నా అవేమీ పట్టనట్లుగా ఖాళీ కుర్చీల కోసం వెంపరాడారు. ఎల్లోమీడియా తాపత్రయం చూసిన ప్రజలు మధ్యాహ్నం నుంచి ఉన్న వారి గురించి రాయరు, చూపరు గానీ, ఇలాంటి ఫోటోలు తీసి కార్యక్రమం ఎత్తిపోయిందని మాత్రం రాయడానికి ముందుంటారని చీదరించుకుంటూ చర్చించుకోసాగారు.

పండుగలా సామాజిక సాధికార యాత్ర



సామాజిక సాధికార యాత్ర పండుగలా ఉంది. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల సామాజిక సాధికారత గురించి వింటూనే ఉన్నాం, అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదే. మాటల్లో చెప్పి చేతల్లో చేసి చూపించారు.బడుగు, బలహీన వర్గాల వారిని ప్రభుత్వంలో కీలకంగా మార్చారు. పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా కొనసాగించాలి. అందుకు ప్రజలు మద్దతుగా నిలవాలి.

– ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

చంద్రబాబు మోసగిస్తే... జగన్ అభిమానిస్తున్నారు



రాష్ట్రంలో ఓట్ల కోసం మహిళలు, రైతులను చంద్రబాబు మోసగిస్తే వారి అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు కుటుంబ సభ్యులు, జన్మభూమి కమిటీలు బాగుపడ్డాయి, ప్రజలకు ఒక్క మేలు చేయలేదు. వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఇంత మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌ను అన్ని వర్గాల వారు ఆదరించాలి

– ఎమ్మెల్యే ఎస్ రఘురామిరెడ్డి

సంక్షేమం కొనసాగాలి



సమాజంలో పేదరికం పోవాలంటే సంక్షేమం, తోడ్పాటు కొనసాగాలి. గతంలో పింఛన్ కోసం వృద్ధులు పడిగాపులు కాసేవారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి తెల్లవారుజామునే అవ్వాతాతలకు పింఛన్ అందిస్తూ వారి ముఖాల్లో సంతోషం నింపుతున్నారు.

– ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, తదితరులు

రాయచోటి : స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్జీల స్వీకరణలో జాయింట్ కలెక్టర్‌తోపాటు కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ, డీఆర్ఓ సత్యనారాయణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ్, ఈడీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను ప్రజలు సంతృప్తి చెందేస్థాయిలో నిర్ణీత గడువులోగా వేగవంతంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని, అధికారులందరూ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు.

స్పందన కార్యక్రమంలో కొన్ని సమస్యలు..

రాజంపేట మండలం, గుండ్లూరు గ్రామానికి చెందిన నాగేశ్వయ్య తనకు సదరం సర్టిఫికెట్ మంజూరు చేయించాలని అర్జీ అందజేశారు. రాయచోటి పట్టణం, మాసాపేటకు చెందిన షేక్ ఇమామ్ సర్వే నెంబరు. 1229లో రెండు ఎకరాల తన భూమి ఆన్‌లైన్ చేయించి పాసుబుక్కులు మంజూరు చేయించాలని స్పందన కార్యక్రమంలో అర్జీ సమర్పించారు. రైల్వేకోడూరు పట్టణానికి చెందిన ఎస్ అనుసూయ తనకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయించాలని విన్నవించారు. రామాపురం మండలం, కసిరెడ్డిగారిపల్లె గ్రామానికి చెందిన సి. లక్ష్మీదేవి తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయించాలని స్పందన కార్యక్రమంలో అర్జీ సమర్పించారు. వివిధ సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిపై దృష్టి సారించాలి

రాయచోటి నియోజకవర్గ అభివృద్ధిపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించిన కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి : వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నియోజకవర్గంలోని గ్రామాల్లో నెలకొంటున్న తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రాయచోటి నియోజకవర్గంలో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం, జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన పనుల ప్రగతిపై పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ విభాగాలలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆయా శాఖల ఇంజనీరింగ్‌అధికారులతో వారు సమీక్షా సమావేశం నిర్వహించాచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అభివృద్ధి పనులలో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో 1200 పల్లెలున్నాయన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. సమస్యల తీవ్రతను బట్టి ఏ, బీ, సీ కేటగిరీలుగా పనులను విభజించుకుని వాటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వాటర్ గ్రిడ్ పనులకు సంబంధించి టెండర్ అయిందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. లక్కిరెడ్డిపల్లె పట్టణంలో నెలకొన్న తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పంచాయతీరాజ్ పనులపై కూడా ఎమ్మెల్యే ఆరా తీశారు. ఎంపీ నిధులతో చేపట్టిన రామాపురం బస్‌స్టేషన్ నిర్మాణాలపై ఆరా తీశారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసన్నకుమార్; పీఆర్ ఎస్ఈ ఎం.దయాకర్, పీఆర్ డీఈ వెంకటరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు శ్రీనివాసులు రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఆయా శాఖల మండల ఇంజనీరింగ్ అధికారులు, స్టేట్ సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాయచోటి నియోజకవర్గం అభివృద్ధిపై సమీక్ష చేస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

చేప.. ప్రజలకు చేరువ

అన్నమయ్య జిల్లాలో చేపలకు సంబంధించిన సమాచారం

21 (లక్షలకు పైచిలుకు)	17	617	02	31
జిల్లాలో గతేడాది పెంచిన చేప పిల్లల సంఖ్య	జిల్లాలో ఉన్న మత్స్యకారుల సంఘాలు	అన్నమయ్య జిల్లాలో మత్స్యకారులు	ప్రస్తుతం అధికారికంగా చేపల విడుదలకు ఉన్న రిజర్వాయర్లు	చేపల విక్రయానికి మినీ రీటైల్ షాపులు

- సోమశిల, వెలిగల్లుల్లో 21 లక్షలకు పైగా చేపపిల్లల పెంపకం
- నేడు మత్స్యకారుల దినోత్సవం

సాక్షి రాయచోటి : చేతికి చేప చిక్కింది. రాష్ట్ర ప్రభుత్వ చర్యలు ఫలించడంతో మత్స్య సంపద పుష్కలంగా ఉంది. నేడు మత్స్యకార దినోత్సవ సందర్భంగా ఆక్వా హబ్ ఏర్పాటు తదితర విషయాలపై కథనం.

జిల్లాలో ప్రస్తుతం ఏడాదికి సగటున ఒక్కొక్కరు 10కిలోలలోపు ఆక్వా ఉత్పత్తులు వినియోగిస్తున్నారు. ఆక్వా ఉత్పత్తులు పౌష్టికాహారంలో కీలకపాత్ర పోషిస్తున్నందున సగటు వినియోగం 25-30 కిలోలకు పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ఆక్వా హబ్‌లు ఏర్పాటు చేసింది.

రీటైల్ వెండింగ్ షాపుల్లో ఫ్రెష్‌గా ఫిష్

అన్నమయ్య జిల్లాలో ఫ్రెష్‌గా ఫిష్‌ను అందిస్తున్నారు. జిల్లాలోని రాయచోటి మొదలుకొని అన్ని ప్రధాన పట్టణాల్లోనూ మినీ ఫ్రెష్ రీటైల్ షాపులను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 31 మినీ ఫ్రెష్ రీటైల్ దుకాణాలను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచారు. అంతేకాకుండా మరో 17 ద్విచక్ర వాహనాలతోపాటు త్రీ వీలర్ ఒకటి, ఫోర్ వీలర్లను సబ్సిడీపై అందించారు.



ప్రాజెక్టులో చేప పిల్లలను వదులుతున్న అధికారులు

21 లక్షల పైచిలుకు చేప పిల్లల పెంపకం

గతేడాది అన్నమయ్య జిల్లాలోని బాహుదా, రాజంపేట మత్స్య కేంద్రాల నుంచి 11.20 లక్షల చేప పిల్లలను పెంచారు. అలాగే పీలేరు మత్స్య కేంద్రం నుంచి 4.80 లక్షలు చేప పిల్లలను తయారు చేయగా, ప్రధాన మంత్రి మత్స్య సంవృద్ధి యోజన కింద మరో 5.90 లక్షల చేప పిల్లలను పెంచారు. మొత్తం మీద 21 లక్షలకు పైగా చేప పిల్లలను పెంచి సోమశిల వెనుక జలాలతోపాటు వెలిగల్లు ప్రాజెక్టులో వదిలారు.

చేపల ఉత్పత్తికి ప్రత్యేక చర్యలు



అన్నమయ్య జిల్లాలో ఎక్కడికక్కడ ఫ్రెష్‌గా చేపలను విక్రయించేందుకు రీటైల్ దుకాణాలను ఏర్పాటు చేశాం. జిల్లా వ్యాప్తంగా 31 దుకాణాలతోపాటు ప్రత్యేకంగా వాహనాల ద్వారా సరఫరా చేస్తున్నాం. ఎక్కడికక్కడ జిల్లాలో చేప పిల్లలను పెంచి అనుమతులు ఉన్న రిజర్వాయర్లలో వదులుతున్నాం. ప్రతి ఏడాది చేపల ఉత్పత్తికి ప్రత్యేక చర్యలు తీసుకుంటూ ప్రజలకు చేపలను అధికంగా వాడేలా చర్యలు తీసుకుంటున్నాం. మంగళవారం ప్రపంచ మత్స్యకార దినోత్సవ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

– యస్.సుస్మిత, మత్స్య శాఖ అధికారి,అన్నమయ్య జిల్లా.రాయచోటి

ఉర్దూ ప్రేమికుడు

- ఉర్దూ భాషాభివృద్ధే లక్ష్యం
- కవి సమ్మేళనాలు, సదస్సులు నిర్వహణ

ప్రొఫైల్

పేరు	: పఠాన్ మహమ్మద్‌ఖాన్
తల్లిదండ్రులు	: పఠాన్ అమీన్‌ఖాన్, సలీమాబీ
వృత్తి	: ఉపాధ్యాయులు,
ప్రవృత్తి	: ఉర్దూ కవి
నివాసం	: మోతీనగర్, మదనపల్లె
విద్యార్హతలు	: బీఎస్‌సీ, ఎం.ఏ(ఇంగ్లీషు), ఎం.ఏ(ఉర్దూ), బీఎడ్

మదనపల్లె సిటీ : ఉర్దూ సాహిత్యం, కవిత్వం, విమర్శనాత్మక వ్యాసాలు రాయడమంటే మాములు విషయం కాదు. అనుభవం, ఆలోచనలకు పదును పెట్టాలి. భాష, యాసపై పట్టు సాధించాలి. సామాజిక స్పృహ ప్రతిబింబించాలి. అందరినీ ఆలోచింపజేస్తూ అక్షర సేద్యం చేయాలి. మాతృభాషలు తమ ఉనికిని కోల్పోతున్న నేటి తరుణంలో ఉర్దూ భాషాభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్న ఉపాధ్యాయుడు, కవి పఠాన్ మహమ్మద్‌ఖాన్. మదనపల్లె పట్టణం మోతీనగర్‌కు చెందిన ఈయన వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. 'జోహర్' కలం పేరుతో ఉర్దూలో అనేక హమ్ద్, నాత్, గజల్స్ రాశారు. పలు రాష్ట్రాల్లో జరిగే ఉర్దూ సదస్సులు, సెమినార్లు, కవిసమ్మేళనాలకు జరిగినా హాజరై తన కవిత్వాలు, సాహిత్యంతో అందరిని ఆకట్టుకుంటారు. మదనపల్లె పట్టణంలోని బడేమనాక్ దర్గాలో జరిగే అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనాలకు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) రాష్ట్ర కార్యదర్శిగా, అంజుమన్ తరక్కీ-ఏ-ఉర్దూ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఉంటూ ఉర్దూ భాషాభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నారు.

ఇటీవల రాష్ట్ర ఉర్దూ అకాడమీ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంటు అవార్డును రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.



సీఎం వైఎస్ జగన్ నుంచి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంటు అవార్డు అందుకుంటున్న మహమ్మద్‌ఖాన్ (ఫైల్)

అందుకున్న పురస్కారాలు, ప్రశంసలు

- 2007లో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ద్వారా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు
- 2013,2015,2018,2022లలో బెస్ట్ సెక్టోరియల్ అధికారి అవార్డు
- 2019 రాష్ట్ర ఉర్దూ అకాడమీచే ఉర్దూ ఎక్స్‌లెన్సీ అవార్డు
- 2023లో జిల్లా, ప్రాంతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు
- 2023లో కార్వాన్-ఏ-ఉర్దూ సంస్థచే ఉర్దూ రతన్ అవార్డు
- 2023 రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

మాతృభాషతోనే మానవీయ విలువలు

మాతృభాషలు తమ ఉనికిని కోల్పోతున్న ప్రస్తుత కాలంలో మాతృభాషలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మాతృభాషలతోనే మానవీయ విలువలు సాధ్యం. ఉర్దూ మన దేశంలో పుట్టి పెరిగిన జాతీయ భాష. ఎంతో మధురమైన భాష. ఉర్దూలో నిర్వహించే కవి సమ్మేళనాలు జాతీయ సమైక్యతకు దోహదపడతాయి. ఉర్దూ భాషాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సేవలు ప్రశంసనీయం. మాతృభాషలను పరిరక్షించుకోవడం సమిష్టి బాధ్యత.

– పి.మహమ్మద్‌ఖాన్, ఉపాధ్యాయుడు, కవి. మదనపల్లె.

నవశకం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధితో పాటు పేదలకు అవసరమైన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో మెరుగైన పాలన అందిస్తున్నారు. పేదల సొంతింటి కల సాకారం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా మంజూరు కాని సర్టిఫికెట్లను క్షణాల్లో చేతికి అందిస్తున్నారని వివిధ వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. ఒకప్పుడు కార్పొరేట్ పాఠశాలల్లోనే ఇంటరాక్టివ్ ఫ్లాట్ (ఐఎఫ్‌పీ) విధానం ఉండేది. ఇప్పుడు ఆ విధానాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇది విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడగలదు. మరో ప్రధానమైన అంశం నాడు–నేడు కింద పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సమకూరాయి. జగన్ సీఎం అయ్యాక ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాలు గణనీయంగా పెరిగాయి.

- వెంకటయ్య, సైన్స్ ఉపాధ్యాయుడు, ప్రభుత్వ హైస్కూల్, రాజంపేట

ఇంటికే చేరిన సర్టిఫికెట్లు



గతంలో సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత జగనన్న సురక్ష పథకం ద్వారా నాకు అవసరమైన కులం, ఆదాయం సర్టిఫికెట్లు మా ఇంటికే వచ్చాయి. జగనన్న అమలు పరుస్తున్న పథకాల వల్ల అందరికీ మంచి జరుగుతుంది.

- వంకర వెంకటమ్మ, చింతలచెలిక గ్రామం, చిట్వేలి మండలం

సొంతింటి కల సాకారం



పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో సొంతింటి కల సాకారమైంది. నిరుపేదలమైన మాకు గతంలో ఎన్ని సార్లు అర్జీ పెట్టుకున్నా ఇల్లు మంజూరు కాలేదు. జగన్ పుణ్యమా అని ఈ ప్రభుత్వంలో ఇల్లు మంజూరైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

- రామక్క, రామానాయక్ తాండా, జాండ్ల, పీలేరు మండలం

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు

మేలు జరగాలంటే మళ్లీ జగనే రావాలి

- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి
- 23న కడపలో సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని పిలుపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఇక్కడి డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డిలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎవరూ, ఎక్కడా చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి అన్ని రంగాల్లో వారిని ఉన్నత స్థాయికి తీసుకొచ్చారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు బీసీలకు పనిముట్లు ఇచ్చి వారిని కులవత్తులకే పరిమితం చేయాలని చూస్తే, దివంగత వైఎస్సార్ ఫీజు రీయంబర్స్‌మెంట్ ప్రవేశపెట్టి ఆయా వర్గాలకు ఉన్నత చదువులు చదివించారన్నారు. సామాజిక సాధికార బస్సుయాత్రలకు రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందని, కడపలో కూడా ఈ యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కడప మేయర్ కె. సురేష్ బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కీలక పదవులు కట్టబెట్టి రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించారన్నారు. పార్టీకి 8 రాజ్యసభ పదవులు వస్తే అందులో నాలుగింటిని బీసీలకే ఇచ్చారని గుర్తు చేశారు. మొదటిసారి యాదవులకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాన్నారు. అన్ని సామాజిక వర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏ విధంగా మేలు చేసిందో తెలియజేయడానికే బస్సుయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు.

సామాజిక సాధికారత మా ప్రభుత్వ విధానం – డిప్యూటీ సీఎం

గతంలో సామాజిక సాధికారత ఒక నినాదంగా మాత్రమే ఉండేదని, ప్రస్తుత మా ప్రభుత్వం దానిన విధానంగా మార్చేసిందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. రాష్ట్ర జనాభాలో 70 శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అన్ని ప్రభుత్వాలు ఓటు బ్యాంకుగానే ఉపయోగించుకున్నాయని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 25 మంది మంత్రులుండగా 75 శాతం అనగా 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మంత్రులే ఉన్నారన్నారు. వారిలో ఐదుగురికి ఉప ముఖ్యమంత్రి పదవులు ఇచ్చారని గుర్తు చేశారు. అన్ని పదవుల్లో పనుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం తెచ్చారని అందులో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు.లక్షా ఎనభై వేల కోట్ల రూపాయలను డీబీటీ ద్వారా బడుగు, బలహీన వర్గాలకు అందించామన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఒక్క మైనార్టీకి కూడా మంత్రి పదవి ఇవ్వకుండా పాలన చేశారని చెప్పారు. కడపలో 23వ తేది సాయంత్రం 3.30 గంటలకు ఏడు రోడ్ల కూడలి వద్ద సామాజిక సాధికార బస్సుయాత్ర బహిరంగ సభ జరుగనుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రాబోయే ఎన్నికల్లో పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం – ఎమ్మెల్సీ

రాబోయే ఎన్నికల్లో పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం జరగబోతోందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. పేదలకు ప్రతినిధిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటే పెత్తందారులకు ప్రతినిధిగా చంద్రబాబు ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 59వేల మందికి పదోన్నతులు ఇచ్చి, సామరస్యంగా బదిలీలు చేశారన్నారు. 3200 ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు భర్తీ చేయబోతున్నారని, 8200 పోస్టులకు డీఎస్సీ నిర్వహించనున్నారని తెలిపారు. గ్రూప్–1, గ్రూప్–2 పోస్టుల భర్తీకి కూడా నోటిఫికేషన్ విడుదల కానుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్ కుమార్, వేర్ హౌస్ కార్పొరేషన్ ఛైర్మన్ కరిముల్లా, టీటీడీ బోర్డు సభ్యులు ఎస్. యానాదయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు చొప్పా యల్లారెడ్డి, జయచంద్రారెడ్డి, సీహెచ్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు!

సింహాద్రిపురం: సింహాద్రిపురం మండలంలోని చెర్లోపల్లె గ్రామానికి చెందిన శ్రీహరి, గోవర్ధని అనే అక్క, తమ్ముడు ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు. అసలే పేదరికం .. దీనికితోడు అనారోగ్యం.. ఆపై ఆర్థిక భారం .. ఖరీదైన ఆసుపత్రులకు వెళ్లి వైద్య చికిత్స పొందలేని దయనీయ స్థితి. ఇది ఓ అక్కా తమ్ముడి దీనగాధ. వీరిద్దరూ కండరాల బలహీనత అనే జన్యుపరమైన వ్యాధితో బాధ పడుతున్నారు. వారిలో అక్క 10 తరగతి, సోదరుడు డిగ్రీ వరకు చదువుకున్నారు. వారి తండ్రి పదేళ్ల క్రితం చనిపోవడంతో వారి ఆలనా పాలన తల్లే చూసుకుంటోంది. ప్రభుత్వం నుంచి వారికి నెలకు రూ.5 వేలు పింఛన్ వస్తుంది. ఈ డబ్బులు వారి కుటుంబ పోషణకు.. వైద్యఖర్చులకు సరిపోవడం లేదు. స్నేహిత అమృత సేవా సమితి అధ్యక్షుడు రాజు హైదరాబాదులో తన స్నేహితుడు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన జాషువాకు విషయం తెలిపారు. దీంతో ఆయన గత ఐదు నెలల నుంచి నెలకు రూ.2 వేలు చొప్పున పంపిస్తున్నారు. దాతలు స్పందించి తమను ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.



అనారోగ్యంతో బాధపడుతున్న అక్కాతమ్ముడు

ఇద్దరు దొంగల ముఠా సభ్యుల అరెస్టు

100 గ్రాముల బంగారు, రూ.50 వేల నగదు, మోటార్ సైకిల్ స్వాధీనం



దొంగల ముఠా సభ్యుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ కేశప్ప, సీఐ సత్యనారాయణ

మదనపల్లె : తాళాలు వేసిన ఇళ్లపై రెక్కీ నిర్వహించి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగల ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఇటీవల మదనపల్లె పట్టణం, మండలంలో తరచూ ఇళ్లల్లో చోరీలు జరగడంతో జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాలతో కేసుల దర్యాప్తుకు తాలూకా సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. దర్యాప్తులో భాగంగా సాంకేతిక అంశాల ఆధారంగా ఆదివారం ఉదయం బసినికొండ సచివాలయం వద్ద పట్టణంలోని మోతీనగర్‌కు చెందిన ఎస్.షాహీద్‌బాషా, తమిళనాడు రాష్ట్రం గుడియాత్తంకు చెందిన ఎస్.అహమ్మద్‌బాషా(31) అనే నిందితులను అదుపులో తీసుకున్నామన్నారు. వీరి వద్ద నుంచి 100 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు, ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీటితో పాటు సమద్‌బాషాను ఇదివరకే అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు. అంతేకాకుండా చోరీ కేసులో మరో ఇద్దరు ప్రధాన నిందితులు ఉన్నట్లు గుర్తించామని, వారి కోసం గాలింపు కొనసాగుతోందన్నారు. త్వరలోనే వారిని అరెస్టు చేసి మరింత సొమ్ము రికవరీ చేస్తామన్నారు. షాహిద్‌బాషా ఆధ్వర్యంలో అయిదుగురు ముఠా సభ్యులుగా ఏర్పడి పగటిపూట తాళాలు వేసిన ఇళ్లపై రెక్కీ నిర్వహించేవారన్నారు. రాత్రుళ్లు చోరీలకు పాల్పడి నగదు, నగలు అపహరిస్తున్నారని తెలిపారు. వీరు దాదాపు 20 చోరీ కేసుల్లో నిందితులుగా నేరచరిత్ర కలిగివున్నారని తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకున్నప్పటి నుంచి పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఎలాంటి చోరీలు జరగలేదన్నారు. చోరీల నివారణకు గస్తీ మరింత ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. మదనపల్లె డివిజన్‌లోని ప్రజలు బయట ప్రాంతాలకు వెళ్లినప్పుడు విలువైన వస్తువులు, ఆభరణాలు ఇంట్లో ఉంచవద్దని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. లాక్డ్ హౌస్ వివరాలను సంబంధింత పోలీసుస్టేషన్‌లలో తెలియజేయాలన్నారు. ద్విచక్రవాహనాలకు ఫోక్సులాక్ తప్పనిసరిగా వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్.ఐ సుధాకర్, దర్యాప్తు బృందం సభ్యులు శంకర, మహమ్మద్, నరసింహులు, రాఘవ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

బత్యాల బరితెగింపు రాజకీయాలు రాజంపేటలో సాగవు

మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి

రాజంపేట టౌన్ : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్‌రాయుడు బరితెగింపు రాజకీయాలు రాజంపేటలో సాగవని మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి హెచ్చరించారు. చెంగల్‌రాయుడు వైస్ చైర్మన్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో సోమవారం ఆయన విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఘాటుగా స్పందించారు. బత్యాల తనను దూషించి మాట్లాడిన మాటలకంటే తాను ఇంకా ఎక్కువ మాట్లాడగలనన్నారు. అయితే చెంగల్‌రాయుడులాగా తాను దిగజారి మాట్లాడటానికి తనకు సంస్కారం అడ్డువస్తుందన్నారు. తనను రాజంపేటలో లేకుండా చేస్తానన్న బత్యాలకు అంత దమ్ము, ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. నిజంగా అంత దమ్ము, ధైర్యం ఉంటే సమయం చెప్పాలని మర్రి రవి చెంగల్‌రాయుడుకు సవాల్ విసిరారు. చెంగల్‌రాయుడు తనను రాజంపేట నుంచి తరిమివేయాలంటే పది జన్మలు ఎత్తినా అది సాధ్యమయ్యే పనికాదన్నారు. తాటాకు చప్పుళ్లకు భయపడే వారు ఎవరూ లేరన్న విషయాన్ని ఆయన గుర్తుంచుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు, సీనియర్ నాయకులు జెనుగు కృష్ణారావు యాదవ్, బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, అరిగెల సౌమిత్రి, పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, వడ్డే రమణ, మిర్యాల సురేఖ, దండు గోపి, దాసరి పెంచలయ్య మాట్లాడుతూ వైస్ చైర్మన్ వీధిలోకి రౌడీమూకలను తీసుకొచ్చి అక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం తప్ప ఆయన చేసిందేమీ లేదన్నారు. చెంగల్‌రాయుడు తన రాజకీయ జీవితంలో ఒక్కసారి అయినా ప్రత్యక్ష ఎన్నికల్లో గెలిచిన దాఖలాలు లేవని తెలిపారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భిక్షతో ఎమ్మెల్సీ అయిన ఆయన ఏరోజైనా వైఎస్సార్ రుణాన్ని తీర్చుకునే ప్రయత్నం చేశాడా? అని ప్రశ్నించారు. చెంగల్‌రాయుడు వైఎస్సార్ సీపీలోకి వచ్చేందుకు ప్రయత్నించాడని, అయితే తమ పార్టీ నాయకులు ఆయనకు ద్వారాలు మూసేశారని తెలిపారు. ఈ విషయం తెలుగుదేశం పార్టీ అధిష్టానానికి తెలియడంతో చెంగల్‌రాయుడు తన తెరచాటు రాజకీయాన్ని కప్పిపుచ్చుకునేందుకు మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవిని టార్గెట్ చేశాడని తెలిపారు. విలేకరుల సమావేశం అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు చెంగల్‌రాయుడుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అతివేగానికి ఆరు నెలలు జైలుశిక్ష

నందలూరు (రాజంపేట) : అతివేగంగా తన ద్విచక్రవాహనాన్ని నడిపి ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటనకు కారణమైన నిందితురాలు చెప్పలి ఫాతిమా రిజ్వానాకు ఆరునెలలు జైలుశిక్ష, రూ. 1000 జరిమానా విధిస్తూ నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కె.లత సోమవారం తీర్పునిచ్చారు. పుల్లంపేట మండలం, శ్రీరాములపేట మిట్టకు చెందిన అవ్వారు శివశంకరయ్య అనే వ్యక్తిని ఫాతిమా (రిజ్వాన) 2020 సంవత్సరంలో తన వాహనంతో అతివేగంగా ఢీ కొంది. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. నేరం రుజువు కావడంతో నిందితురాలికి జడ్జి ఈమేరకు శిక్ష, జరిమానా విధించారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

నిమ్మనపల్లె : జూదం ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని వెంగంవారిపల్లె పంచాయతీ సైదాపేట గ్రామ సమీపంలో జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.2,490 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఆటో డ్రైవర్ మృతి



మృతి చెందిన ఆటో డ్రైవర్ వెంకటేష్

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలో ఆంజనేయస్వామి గుడి వీధికి చెందిన వెంకటేష్ అనే ఆటో డ్రైవర్ విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. సోమవారం శాంతి నగర్‌లో కొత్తగా నిర్మాణంలో ఉన్న భవనంపై నుండి స్టీల్‌పైపులు కిందకు దించుతుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వెంకటేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, ఐదేళ్ల కుమారుడు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలుకిందపడి యువకుడి మృతి



పఠాన్ ఖాదర్‌ఖాన్ (ఫైల్)

గాలివీడు : మండల కేంద్రంలోని నజిరుల్లా ఖాన్ వీధికి చెందిన పఠాన్ ఖాదర్‌ఖాన్(29) రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. నాలుగు రోజుల క్రితం ఇంట్లో ఘర్షణ పడి ముంబయికి వెళ్లాడు. తల్లికి అనారోగ్యంగా ఉందని సమాచారం అందించడంతో ఆదివారం ముంబయి నుంచి కడపకు రైలులో వస్తుండగా మార్గమధ్యంలో అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో అక్కడికక్కడే ప్రాణాలు పోగొట్టుకున్నాడు. సమాచారం అందడంతో నజిరుల్లా ఖాన్‌వీధిలో విషాదఛాయలు అలుముకున్నాయి. రైల్వే పోలీసులు సోమవారం రాత్రి ఖాదర్‌ఖాన్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యకు యత్నించి స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని చౌడేశ్వరినగర్‌కు చెందిన జి.వి. రావు కుమారుడు శ్రీనివాసులు(32)కు ఇటీవల పెళ్లి నిశ్చయమైంది. అయితే.. అకస్మాత్తుగా అతడి తల్లి మరణించడంతో పెళ్లి వాయిదా పడింది. దీంతో పెళ్లికుమార్తె తరపువారు ఈ సంబంధం తమకు వద్దని, తాము వేరే సంబంధం చూసుకుంటామని సమాచారం అందించారు. దీంతో మనస్తాపం చెందిన శ్రీనివాసులు ఇంట్లోనే మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదేవిధంగా గౌతమీనగర్‌కు చెందిన పి.రాజశేఖర్(30) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కుటుంబ పోషణకు సంపాదన సరిపోక నిత్యం ఆర్థిక ఇబ్బందులు వేధిస్తుండటంతో మనస్తాపం చెంది సోమవారం ఉదయం నివాస ప్రాంత సమీపంలోని గుట్టలోకి వెళ్లి విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయా ఘటనల్లో కుటుంబ సభ్యులు బాధితులను స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చింత చెట్టుకు నిప్పు.. పొంచి ఉన్న ముప్పు



చింతచెట్టుపై మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో అటవీశాఖకు సంబంధించిన స్థలంలో చింతచెట్టుకు నిప్పంటుకోవడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. మద్యం దుకాణం సమీపంలో ఉండటంతో ఆకతాయిలు నిప్పంటించడంతో సోమవారం తెల్లవారుజామున ఒక్కసారిగా చెట్టు మొదలు నుంచి మంటలు పెద్దఎత్తున వ్యాపించాయి. గతంలో కూడా ఇదే చింతచెట్టుకు రెండుసార్లు నిప్పంటించడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. చెట్టు మొదలు కాలిపోవడంతో ఎప్పుడు పడిపోయి ప్రమాదం వాటిల్లుతుందోనని పాదచారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫారెస్టు అధికారిణి స్నేహలత సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

108లో ప్రసవం



108లో ప్రసవించిన బిడ్డను కుటుంబ సభ్యులకు అందిస్తున్న సిబ్బంది

మదనపల్లె : ఓ మహిళ 108 అంబులెన్స్ వాహనంలో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన సంఘటన సోమవారం జరిగింది. కురబలకోట మండలం గొడ్డిండ్లవారిపల్లెకు చెందిన రెడ్డెప్ప భార్య రోజా(25)కు మూడో కాన్పులో భాగంగా ఆదివారం అర్ధరాత్రి తర్వాత పురిటినొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు రాత్రి 1గంట సమయంలో 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి 2 గంటలకు చేరుకున్నారు. అప్పటి నుంచి ఉదయం 6 గంటలవరకు ఆస్పత్రిలో ఆమెకు ప్రసవం కాకపోవడంతో ఇక్కడి వైద్యులు తిరుపతి మెటర్నటీ వైద్యశాలకు వెళ్లాల్సిందిగా ఆమెను రెఫర్ చేశారు. దీంతో 108 అంబులెన్స్ వాహనంలో తిరుపతికి బయలుదేరారు. మార్గమధ్యంలో భాకరాపేట వద్ద ఆమె పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డను ఈఎంపీ గోపి, పైలట్ భార్గవ్ కుటుంబ సభ్యులకు అందించారు. ప్రసవానంతర చికిత్సలకు తల్లి,బిడ్డను ఆస్పత్రికి తరలించారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
THE AP SHILPARAMAM ARTS, CRAFTS AND CULTURAL SOCIETY

Tender notice.No. 63/AP/SHILPARAMAM/ TENDER/KDP/2023 Dt. 21.11.2023

Tenders are invited from the competent and eligible agencies for Operation & Maintenance of "Parking management services" on lease basis at Shilparamam, Kadapa. The above tender documents may be procured from the O/o the Administrative Officer Shilparamam, Kadapa and download from APSACCS website. www.shilparamamap.gov.in. The tender document fee shall be paid through DD for Rs. 2,000/- in favour CEO, APSACCS, Vijayawada while submitting the tender. Issue of tender schedules from 21.11.2023. Last date for submission of the tenders @ 3.00 pm on 03-12-2023. For more details please contact Mobile No.8886652058 (or) 9441989272 and visit our website.

Sd/- A.O.Shilparamam, Kadapa.

